క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్



తెనాలిరూరల్: నిబంధనలను అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు హెచ్చరించారు. తెనాలి ఎంవీఐ కార్యాలయ పరిధిలో వివిధ చోట్ల బుధవారం వాహన తనిఖీలు చేశారు. గూడ్స్ వాహనాలను ప్రజా రవాణాకు వినియోగించకూడదని స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో, ఇతర వాహనాల్లో ఎక్కించుకోకూడదన్నారు. నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి డ్రైవర్లు/యజమానులు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి నిబంధనలు అతిక్రమించి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని, దానితో పాటు కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తామని హెచ్చరించారు.

అర్హులందరికీ పనులు కల్పించాలి

కొల్లిపర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన కూలీలందరికీ పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ పి.బాలమ్మ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల ఉపాధిహామీ పథకానికి చెందిన రికార్డులను పరిశీలించారు. ఉపాధి పనులపై ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏపీడీ బాలమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 2022, 23 సంవత్సరాల్లో రూ.4కోట్ల50 లక్షల20 వేలు ఉపాధి హామీ పనులు జరిగాయని, వీటిపై తనిఖీ చేయటం జరిగిందన్నారు. సన్న, చిన్నకారు రైతులు నిమ్మ, నేరేడు, జామ, మునగ, పశువులకు పచ్చిగడ్డి లాంటి పంటలు వేస్తే సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలని కోరారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపాధిహామీ జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, ఏపీడీలు శివనారాయణ, ఆనందమోహన్, డీపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతచెట్టుకు నిప్పు...

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారులో కర్నూలు- గుంటూరు రాష్ట్ర రహదారికి పక్కన వున్న చింతచెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు పెద్దవిగా లేవడం చెట్టు సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగలు ఉండటం గమనించిన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఏఈ పుల్లారెడ్డి, సత్తెనపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే చెట్టు మొదలు భాగం దహనం కావడంతో పొక్లెయిన్‌తో చెట్టును రోడ్డు వైపునకు కూల్చి వేశారు. ఏఈ పుల్లారెడ్డి మాట్లాడుతూ చెట్టు పూర్తిగా దహనం కావడంతో తీగలపై కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికుల సమాచారంతో చెట్టును రోడ్డువైపునకు పడేలా చేశామన్నారు. ఆయన వెంట లైన్‌ఇన్‌స్పెక్టర్ శివకుమార్, లైన్‌మెన్లు అశోక్, అసిస్టెంట్ లైన్‌మెన్ చల్లా శ్రీనువాసరెడ్డి, ఇజ్రాయిల్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

భట్టిప్రోలు: వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3లో భాగంగా భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని స్థానిక రైతుభరోసా కేంద్రం ఆవరణలో బుధవారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంఏ) పెనుమాల అరుణరాణి 60 మందికి పరీక్షించారు. 30 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, ముగ్గుర్ని రిఫరల్‌కు పంపడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల, మత, పార్టీలకతీతంగా పథకాలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- సంగం జాగర్లమూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: కుల, మత, పార్టీలు చూడకుండా నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో బుధవారం రెండో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఐదు వేల పైచిలుకు జనాభా ఉండగా 86 శాతం కుటుంబాలకు సంక్షేమ లబ్ధి అందుతోందని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు 'గడప గడపకు వైఎస్సార్' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగానని, ఇప్పుడు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తిరుగుతుంటే ప్రజల్లో పెరిగిన ఆదరణ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంక్షేమ లబ్ధి పొందిన ప్రతి కుటుంబంలో సీఎం వైఎస్ జగన్ పరిపాలనపై సంతోషం వ్యక్తమవుతోందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఏదేదో చేస్తామని టీడీపీ నాయకులు ఇప్పుడు చెబుతున్నారని, 2014 నుంచి 2019 కాలంలో ఎందుకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయలేదని ప్రశ్నించారు. రైతుల రుణాలు మాఫీ చేస్తానని 2014 ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చి రాష్ట్రంలోని రైతాంగాన్ని మోసం చేశాడని గుర్తు చేశారు. గ్రామంలో గత నాలుగేళ్లలో రూ. 11.80 కోట్ల సంక్షేమ ఫలాన్ని గ్రామస్తులకు డీబీటీ పద్ధతిలో నేరుగా అందించినట్టు తెలిపారు. 227 కుటుంబాలకు వైఎస్సార్ కాపు నేస్తం అందుతోందని, 818 మందికి పెన్షన్‌లు అందిస్తున్నామని చెప్పారు. గత మూడున్నరేళ్లలో సంగం జాగర్లమూడిలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. నాడు-నేడు పథకం కింద గ్రామంలోని పాఠశాలలను రూ. రెండు కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అర్హులైన ప్రజలకు సంక్షేమం పూర్తి స్థాయిలో అందిందా లేదా అన్న అంశాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్నామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకుని రానున్న నాలుగు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామ అవసరాలనూ దృష్టిలో పెట్టుకుని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. డ్రెయిన్, రోడ్డు నిర్మాణం ఇతర సమస్యల గురించి గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని, కేవలం నెలన్నర రోజుల్లో నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, పాలడుగు సాంబశివరావు, రెడ్డి శ్రీనివాసరావు, నాగమోతు రామారావు, పాటంశెట్టి నాగరాజు, దేవిరెడ్డి పూర్ణయ్య, అక్కిదాసు కిరణకుమార్, కఠారి హరీష్, బూరెల దుర్గ, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

పుట్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన..

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు అంబేడ్కర్ నగర్ సమీపంలోని కాల్వలపై పుట్ బ్రిడ్జిల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. జలవనరుల నిధులు రూ.24లక్షలతో అంబేడ్కర్ నగర్ సమీపంలోని పశ్చిమ, నిజాంపట్నం కాల్వలపై వంతెనల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వంతెన నిర్మాణం వలన అంబేడ్కర్ నగర్ ప్రజల చిరకాల కోరిక నేరవేరుతుందన్నారు. వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లిఖార్జున, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్ కుమార్, ఉప సర్పంచ్ మంగా శివనాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌చంద్రబోసు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల మహేష్, బెజ్జం బాజీ, మంగా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు



క్రికెట్ కోచ్ మాలిక్‌ను సత్కరిస్తున్న డీఎల్ కాంతారావు, తదితరులు

తెనాలి: పట్టణానికి చెందిన అమరావతి మహిళా సహకార సొసైటీ, 'పోస్ట్' స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విభిన్న రంగాల్లోని ప్రతిభావంతులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఇస్రో పూర్వ శాస్త్రవేత్త, బీజేపీ నేత డాక్టర్ చందు సాంబశివరావు హాజరయ్యారు. సమాజానికి మంచి చేసిన వ్యక్తులను, సేవలు చేసిన ప్రముఖులను సత్కరించటం మంచి సంప్రదాయంగా ఆయన చెప్పారు. కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు మాట్లాడుతూ సమాజం మనకు ఏమిచ్చిందని కాకుండా తోటివారికి మనమేం చేశామనే కోణంలో సానుకూలంగా ఆలోచించాలని సూచించారు. న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, తన్నీరు నాగమమల్లేశ్వరి దేవి, తన్నీరు కళ్యాణ్‌కుమార్ మాట్లాడారు. సభలో అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశానికి హాజరై వచ్చిన విద్యార్థిని గాదిశెటి మోహన లక్ష్మీప్రియాంక, క్రికెట్ కోచ్ షేక్ కరిముల్లా మాలిక్, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య, శరీరసౌష్టవ పోటీల విజేత తన్నీరు లక్ష్మణ్, యువ చార్టర్డ్ అకౌంటెంట్ జొన్నాదుల భార్గవ్, మానవతావాది సూదా పిచ్చయ్య, ఉత్తమ విద్యార్థిని తన్నీరు మానసబిందులను సత్కరించారు. 'పోస్ట్' సంస్థ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు స్వాగతం పలికారు.

ప్రమాద బాధితులపై ఎమ్మెల్యే మానవత్వం



చెట్లపొదల్లో పడిపోయిన క్షతగాత్రులను బయటకు తీయిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తెనాలి-విజయవాడ రహదారిలో దుగ్గిరాల మండల గ్రామం చింతలపూడి సమీపాన కోడిగుడ్ల ఆటో, మోటారుబైక్ ఢీకొన్న ఘటన బుధవారం జరిగింది. ఘటనలో రెండు వాహనాలు రోడ్డు మార్జిను దాటి, పక్కనే నిజాంపట్నం కాల్వ కట్టపైకి వెళ్లాయి. ఆటో డ్రైవరు, బైకు నడుపుతున్న వ్యక్తి చెట్ల పొదల్లో పడిపోయారు. క్షతగాత్రులై రక్తమోడుతున్నారు. చుట్టుపక్కలవారు ఆగి చూస్తూ, అయ్యోపాపం! అనుకుంటున్నారు. అంతలో అత్యవసర పని నిమిత్తం తాడేపల్లికి బయలుదేరిన స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అదేసమయంలో అక్కడకు చేరుకున్నారు. రోడ్డుపక్కన వాహనాలు పడివుండటం, జనం మూగివుండటాన్ని గమనించి, వెంటనే వాహనాన్ని ఆపించి, కిందకు దిగారు. క్షతగాత్రులను గుర్తించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అది వచ్చేలోగానే స్థానికులతో పడిపోయినవారిని చెట్లపొదల్లోంచి బయటకు తీయించారు. 108 వాహనం రాగానే, అందులోకి భద్రంగా చేర్పించారు. వాహనం బయలుదేరగానే తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఫోన్ చేసి, చింతలపూడిలో జరిగిన ప్రమాదం గురించి చెప్పి, క్షతగాత్రులను తీసుకొని వస్తున్నారని, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించిన ఎమ్మెల్యే శివకుమార్‌ను స్థానికులు అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన పాదిలి వెంకటేశ్వర్లు(63) ఈ నెల 5వ తేదీ సాయంత్రం తన భార్యతో కలసి మోపెడ్‌పై తెనాలి మండలం కంచర్లపాలెం వస్తుండగా గుంటూరు-నందివెలుగు రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలపాలయ్యాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న కలెక్టరేట్ ఎదుట చేనేత ధర్నా

తెనాలి: చేనేతల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని చేనేత నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ప్రగడ కోటయ్య నగర్‌లోని కళ్యాణమండపంలో బుధవారం చేనేత కార్మికుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. మానవ సమాజానికి నాగరికతను అందించిన చేనేత కళ నేడు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. చేనేతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, చేనేతల 11 రకాల రిజర్వేషన్ చట్టాని అమలు చేయాలనీ, నూలు, చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీని తక్షణమే రద్దు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని షెడ్ మగ్గాల నేతన్నలకు, ఉపవృత్తుల కార్మికులకు వర్తింపజేయాలనే డిమాండ్లతో ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి, స్పందన సమావేశంలో వినతిపత్రాలను సమర్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. చేనేత సంఘాల నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుర్రం చినవీరయ్య, రామనాధం పరమేశ్వరరావు, జొన్నాదుల నరసింహారావు, కాకుమాను ప్రాన్సిలు మాట్లాడారు. చేనేత కార్మికులు పోలిశెట్టి వెంకటేశ్వరరావు, జొన్నాదుల గోపి, గొర్రె శివశంకరరావు, రంగా వెంకటేశ్వరరావు, చింతక్రింది కోటిస్వామి, వుద్దంటి కృష్ణ, పానుగంటి శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ



తాడికొండ: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్ వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తాడికొండ-1 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్ వాడీ పాఠశాలకు పంపించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించి చిన్నారుల భవితకు బంగారు బాటలు వేయడంలో అంగన్‌వాడీల పాత్రను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ ఎంవీ సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక

- ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న 40వ వార్డు కౌన్సిలర్ నాగవేణి
- తొలిసారి ఎస్సీలకు దక్కనున్న వైస్ ఛైర్మన్ పదవి



కౌన్సిలర్ నాగవేణి

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ రెండో వైస్ ఛైర్‌పర్సన్‌గా 40వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అత్తోట నాగవేణి ఎన్నిక కానున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం కౌన్సిలర్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రకటించినట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మున్సిపాలిటీలలో రెండో వైస్ ఛైర్మన్‌ను నియమించుకోవచ్చని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కౌన్సిల్ ప్రారంభం కాగానే మొదటి వైస్ ఛైర్మన్‌గా మాలేపాటి హరిప్రసాద్, రెండో వైస్ ఛైర్మన్‌గా గుంటూరు కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోటేశ్వరరావు వ్యక్తిగత కారణాలతో గతేడాది డిసెంబర్‌లో రాజీనామా చేశారు. దానిని ఆమోదించిన కౌన్సిల్ విషయాన్ని ఎలక్షన్ కమిషన్‌కు తెలియజేసింది. ఎన్నికల సంఘం ఈనెల 8వ తేదీన వైస్ ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఎన్నికల అధికారిగా సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ప్రత్యేక సమావేశంలో ఎన్నిక నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు మున్సిపల్ అధికారులు చేస్తున్నారు.

ఎస్సీలను వరించిన రెండో వైస్ ఛైర్మన్..

తెనాలి మున్సిపల్ కౌన్సిల్ రెండో వైస్ ఛైర్మన్ పదవి ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని వరించింది. 40వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అత్తోట నాగవేణిని ఎమ్మెల్యే నియమిస్తున్నట్లు ప్రకటించటంతో ఆ సామాజిక వర్గంలో హర్షం వ్యక్తం అవుతుంది. గత 20 సంవత్సరాలలో ఇలా ఎస్సీలకు వైస్ ఛైర్మన్ ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే ప్రభుత్వం ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నో సంవత్సరాల తర్వాత ఇలా ఎస్సీలకు కౌన్సిల్‌లో పెద్ద పీట వేయడంపై ఆయా వర్గాలలో సంతోషం వ్యక్తం అవుతుంది.

ఏకగ్రీవం కానున్న ఎన్నిక..

తెనాలి మున్సిపల్ కౌన్సిల్‌లో 40 మంది సభ్యులు ఉండగా వారిలో 32 మంది వైఎస్సార్ సీపీ, 8 మంది టీడీపీ కౌన్సిలర్‌లు ఉన్నారు. వీరు కాకుండా ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్యే శివకుమార్ ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. దీనిని బట్టి మొత్తం 33 మంది వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారు. ఈనేపథ్యంలో ఎన్నిక ఏకగ్రీవంగా జరగనుంది.

శాస్త్రీయంగా వరి విత్తుకుంటే పంటకు ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి



వరి విత్తడంపై సిబ్బందికి శిక్షణనిస్తున్న రాజకుమారి

దావులూరు(తెనాలి): ఖరీఫ్ సీజనుకు ముందుగా 30 రకాల విత్తనాలను పచ్చిరొట్టగా వేసుకుని, వచ్చిన పంటలను కలిపి దున్నకుండా, కోసి పశువులకు మేతగా వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి సూచించారు. కొల్లిపర మండల గ్రామం దావులూరులో అభ్యుదయ రైతు గొట్టిముక్కల శ్రీధర్ పంట పొలంలో బుధవారం ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌ను 30 రకాల విత్తనాలతో ప్రారంభించారు. అంతరం నేలను దున్నకుండా వరి విత్తుకోవటంపై రాజకుమారి మండల సిబ్బందికి శిక్షణనిచ్చారు. పచ్చిరొట్ట పైరును కోశాక, నేలను దున్నకుండా తాడు సాయంతో వరి విత్తనాలను మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు, వరుస వరుసకు రెండు అడుగుల దూరంతో విత్తుకోవాలని సూచించారు. దీనివల్ల పైరుకు గాలి, నీరు సమపాళ్లలో అందుతుందనీ, చీడపీడల బెడద తప్పుతుందని చెప్పారు. రైతు శ్రీధర్ మాట్లాడుతూ గతేడాది కూడా ఇదే పద్ధతిలో వ్యవసాయం చేయటంవల్ల భూమి సారవంతమైనట్టు చెప్పారు. వరి పంటలో ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడకుండానే మంచి దిగుబడులు వచ్చాయని తెలియజేశారు. రెండో పంటగా వేసిన మొక్కజొన్న కూడా మంచి దిగుబడి రావటంతోపాటు, ఐటీసీ ద్వారా రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష చేయించగా, రసాయన రహితమని నివేదిక కూడా వచ్చిందన్నారు. కార్యక్రమంలో కొల్లిపర మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీకి ఐఎస్ఓ సర్టిఫికెట్



ప్రిన్సిపాల్ వెంకటరమణకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఐఎస్ఓ బృందం

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజిని బుధవారం ఐఎస్ఓ బృందం తనిఖీ చేసింది. ఐఎస్ఓ రెన్యువల్ తనిఖీలో భాగంగా వచ్చిన బృందం పరీక్షల ఫలితాలు, లైబ్రరీ, లేబొరేటరీ, తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులు పరిశీలించి, ఐఎస్ఓ 9001-2015 సర్టిఫికెట్‌ను ఐఎస్ఓ ఇన్‌స్పెక్టర్ కె.కుటుంబరావు, ఎ.సింగయ్యలు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు అందజేశారు. కాలేజీకి ఇప్పటికే పీసీఐ, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, యూజీసీ 2ఎఫ్, 12(బి) అఫిలియేషన్ టు ఏఎన్‌యూ, పర్మినెంట్ అఫిలియేషన్ టు బీఫార్మసీ గుర్తింపు ఉందని డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు. ఐఎస్ఓ తాజా గుర్తింపు 2024 వరకు వర్తిస్తుందని చెప్పారు. తనిఖీలో కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, కె.కళ్యాణ్ చక్రవర్తి, సీహెచ్ నాగశైలజ, డాక్టర్ టి.లక్ష్మీదుర్గ, ఎ.సోనీప్రియాంక పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లకు బెస్ట్ సీనియర్స్ అవార్డు



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న గ్రూపు కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్

మంగళగిరి: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లకు బెస్ట్ సీనియర్స్ అవార్డులు దక్కాయి. బీటెక్ చదువుతున్న విద్యార్థులు ఈ నెల 1వ తేదీన జిల్లా స్థాయి వార్షిక శిక్షణ గోళ్లమూడిపాడులోని నాట్కో కేంద్రీయ విద్యాలయానికి తరలివెళ్లారు. ఈసందర్భంగా విద్యార్థులు లెఫ్టినెంట్ వి.మౌనిక ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జూనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లకు కేఎల్‌యూకు చెందిన సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ శిబిరానికి నాయకత్వం వహించి ఉత్తమ సేవ మార్గదర్శకత్వాన్ని అందించినందుకు గానూ నాలుగు జిల్లాల గ్రూప్ కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ బెస్ట్ సీనియర్స్ అవార్డు అందించి అభినందించారు. అవార్డు అందుకున్న వారిలో 22వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు వి.సాత్విక్, జి.సాయిలక్ష్మి ఉన్నట్లు లెఫ్టినెంట్ మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు క్యాడెట్లను అభినందించారు.

16న పెరియార్ సమకాలీనతపై సదస్సు



పెరియార్ సమకాలీనత సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మంగళగిరి: పెరియార్- సమకాలీనతపై సదస్సు ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్- జాషువా- పూలే- పెరియార్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల విల్సన్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని విగ్రహం ఎదుట పెరియార్ - సమకాలీనత సదస్సు కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. విల్సన్ మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన మందిరంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేటి సమాజంలో పెరియార్ ఆలోచనలను ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సదస్సులో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్‌తో పాటు పలువురు పత్రికా సంపాదకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కిన్నెర చంద్రశేఖర్, రమేష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

'గడప గడపకు' అభివృద్ధి వీచిక

- రూ.6కోట్లతో పలు అభివృద్ధి పనులు
- ఇప్పటికే పూర్తి అయిన రూ.కోటి విలువైన పనులు



పూర్తయిన యడ్లలింగయ్య కాలనీలోని సీసీ రోడ్డు



26వ వార్డు నార్లవారివీధిలో పూర్తి అయిన సీసీ డ్రైన్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మ న ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చి న వినతులను పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20లక్షల నిధులను వెచ్చిస్తు ఆదేశాలు ఇచ్చింది. దీంతో తెనాలి పట్టణంలోని అపరిష్కృతంగా ఉన్న మురుగు కాల్వలు, సీసీ రోడ్ల ను ఈనిధులతో నిర్మిస్తున్నారు. దీంతో ఆయా వా ర్డులలోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలకు సత్వర స్పందన..

తెనాలి 40 వార్డులకు గానూ ఇప్పటి వరకు 36 వార్డులలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేశారు. వార్డులో కార్యక్రమం పూర్తి కాగానే ఆయా సచివాలయాల ఉద్యోగుల ద్వారా వార్డులోని ప్రజలు తెలియజేసిన ప్రధాన సమస్యలు మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, కాల్వర్టుల నిర్మాణాల ప్రతిపాదనలు సిద్ధం చేసి వాటిని ఉన్నతాధికారులకు అనుమతి కోసం పంపారు. అక్కడి నుంచి అనుమతులు కొద్దిరోజులకే రావటంతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు.

రూ.6 కోట్ల పనులకు అనుమతులు..

తెనాలి పట్టణ పరిధిలోని 40 వార్డులలో 30 వార్డులకు సంబంధించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన రూ. 6 కోట్లకు సంబంధించిన 110 అభివృద్ధి పనుల ప్రతిపాదనలు గత నెల చివరి నాటికి ఉన్నతాధికారుల అనుమతుల కోసం పంపారు. వాటిలో ఇప్పటి వరకు 86 పనులకు అనుమతులు వచ్చాయి. ఇప్పటికే 24 పనులు పూర్తికాగా, 36 పనులు జరుగుతున్నాయి.

టెండర్లు పూర్తి చేసుకున్న పనులు 15 ఉన్నాయి. 11 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పట్టణంలోని 24 అభివృద్ధి పనులు ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. అంతేకాకుండా వాటికి సంబంధించిన రూ. కోటి నిధులను కూడా కాంట్రాక్టర్‌లకు అధికారులు చెల్లించారు. పట్టణంలోని పలు సీసీ రోడ్లు, కాల్వలు, మేజర్ కల్వర్టులో వీటిలో ఉన్నాయి.

పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు..



తెనాలి పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వా ర్డులలో పర్యటించినప్పుడు ప్రజలు వారికి తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ నిధులు ఉపయోగిస్తున్నాం. ఇప్పటికే కొన్ని పను లు పూర్తి చేశాం. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కొదాలి నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్, తెనాలి

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్‌నిపాడులోని చెరువుకొండవద్ద వినాయకుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. కొండవీడు రెడ్డిరాజుల ఆస్థాన విద్వాంసుడు శ్రీనాథుడు ప్రతిష్టించి పూజించిన విగ్రహం ఇటీవల గుర్తు తెలియని దుండుగుల చేతిలో ధ్వంసం కావడంతో హౌస్ గణేషునిపాడు, మరియు కొత్తపాలెం గ్రామస్తుల సహకారంతో 11 అడుగుల నూతన గణేషుని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మూడురోజులుగా వేదపండితులు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమాలను పరుచూరి మాధవాచార్యులు, నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ పర్యవేక్షించారు.